
# పల్లెకే పోదాం

**చూరుకిందకి దించిన రేకుల కప్పు, యిటికలు, రాళ్ళు ఏది దొరికితే అది పెట్టి కాస్త సిమెంటు పామిన గోడ, తల దించందే లోపలి కడుగు పెట్టలేని గుమ్మం, యింటి కప్పుమీద సీనారేకు డబ్బాల రేకులు, రెండు సిమెంటు రేకులు ఏదో ఒకటి దొరికింది కప్పిన ఆ గూడుని చూపించి 'నూర్రూపాయలు' అన్నాడు ఏదగిరి.**

యిటు అటు యిళ్ళు మధ్య ఆరు అడుగుల ఖాళి, ఆ ఖాళీ జాగాలోనే ఎవరింటి ముందు వాళ్ళు బండరాళ్ళు పరచుకుని అంట్లు తోముకుంటూ, బట్టలుతుక్కుంటూ ఆడవాళ్ళు- వాళ్ళు వాడిన నీరుతో చిన్న సైజు కాలువలు- యింటి ముందు తాళ్ళ మీద గుడ్డలు, నులక మంచాలు, సిమెంటు నీళ్ళ తొట్టెలు... యిటు అటు కలిసి పాతిక ముప్పై కొంపలు- ఒకేఒక గది అనబడే ఆ కొంప చూసి 'నూర్రూపాయలా అద్దె?'

'మరేటనుకున్నవు. నెత్తిమీద కప్పుంది అంతే చాలనుకోవాలి. తల దాచుకుందుకి యీపాటిది దొరికిందని సంతోసించు. నాకు తెలిసినోడివని యిప్పిస్తన్న. యిది మీ పల్లె కాదు. ఐయిదరాబాదు సిటి. లైటు, పంపుండి సిమెంటుగది కావాలంటే ఏ బస్తీల్లోనూ ఎనిమిది వందలు. ఎయ్యిరూపాయలుంది తెలుసా. ఇక్కడి సంగతులేంటి తెలుసునీకు యిది వద్దన్నావంటే యింకోడు ఎగరేసుకుపోతాడు ఎంటనే. నా మాటిని యిందులో సామానెట్టేసుకో ముందు. వన్నూనం కుని నిల దొక్కుకున్నక మరోటి ఎతుక్కుందువుగాని. మూటలిప్పుకు సామాను సర్దుకోండి. అదిగో ఆ రోడ్డుమీద అగపడ్తందే కొట్టు, ఆ కొట్టుకాడ బియ్యం, పప్పు అన్ని దొరుకుతాయి అక్కడ తెచ్చుకో... ముందు రెండు బకెట్లలో నీళ్ళట్టుకొండి పంపు బంద వుద్ది. 'తొందరపెట్టేశాడు ఏదగిరి. అక్కడ రోడ్డు మీదకి ఉన్న పంపు చూపిస్తూ...'

నెత్తిన వున్న బస్తా చేతిలో ట్రంకు పెట్టెతో కొమరయ్య నడ్డివంచి లోపలికి దూరాడు. రెండు చాపచుట్టలు, ఓ బట్టల మూట, ఓ సంచి చేతిలో పట్టుకుని వెంట గృహప్రవేశం చేసింది రాజమ్మ. ఓ కిటికి కూడా లేని ఆ గదికి వెలుతురు గుమ్మంలోంచే రావాలి. 'ఈ గదిలో ఉండాలా' రాజమ్మ దిగులుగా అంది.



'నేచెవ్వలే. పట్నం అంటే ఇంతే. నూర్రూపాయలకి యింతకంటె ఏం వస్తది. నుద్దాం అదృట్టం బాగుండి నాలుగు రాళ్ళు దొరికితె యింకో చోటికి పోదాం. ముందా బస్తా యిప్పి ఆ బిందె తీసికెళ్ళి నీళ్ళట్రా. 'బస్తా విప్పి రెండు ప్లాస్టిక్ బిందెలు పైన పెట్టాడు. నాలుగు అల్యూమినియమ్ గిన్నెలు, మూతలు, రెండు స్టీలు కంచాలు, గ్లాసులు, ఒక కడాయి, కిరోసిన్ స్టవు ఒక్కొక్క సామాను కింద పెట్టాడు. ట్రంకు పెట్టె, బట్టల మూట ఓ మూల పెట్టాడు. ఓ చాప పరచి రెండో చాప మూల పెట్టాడు. బట్టల మూట విప్పి రెండు దుప్పట్లు తీసి బయట పెట్టాడు. ఓ బిందె నెత్తిన, రెండో బిందె చంకన పెట్టుకుని వచ్చిన రాజమ్మ నీళ్ల బిందెలు ఓ మూల పెట్టింది. 'ఇందులో వండుకుని, ఎక్కడ పడుకోవాలి'. అంది ఆరడు గుల ఆ గది చూస్తూ. రాజమ్మ ముఖం ఇంతయిపోయింది ఆ యిల్లు, పరిసరాలు చూసి. గాలి వెలుతురు లేని ఈ సీనారేకుల చూరు గది చూసి జావకారిపోయింది. 'నే ఎల్లి బియ్యం, ఉప్పు, చింతపండు, కిరసనాయిలు, నూనె గట్రా తెస్తా. స్టవ్వు వెలిగించు చాయ్‌కి నీళ్ళు పెట్టు. చాయ్‌పొడి, వంచదార తెస్తా. పాలు ఎక్కడ దొరుకుతాయో చూస్తా. ఆ సీసాలు యిట్టా ఇయ్యి అని కొమరయ్య సంచిలో సీసాలు పెట్టుకున్నాడు. గుమ్మం దాటబోతుంటే యాదగిరి రెండు గ్లాసుల చాయ్, రెండు బన్ను రొట్టెలు పట్టుకు లోపలికొచ్చాడు. యిందయీ చాయ్ తాగండి ముందు, యీ పూట మా యింట తిందురులెండి. యిప్పుడేం వంట చేస్తారు. సరుకులు తెచ్చు కోండి రాతిరికి వంట మొదలు పెడుదురు. మా ఆడదాంతో చెప్పా మీ ఇద్దరికి వండమని అన్నాడు. అమ్మో తెల్సిన ఈ యాదగిరి లేకపోతే ఎంత ఇబ్బందయ్యేది. ఈ ఊరేంతెలుసు. అమ్మో. ఏం జనం. ఏం కార్లు... యాదగిరి బస్సు కాడకి వచ్చి తీసుకు రాబట్టి వచ్చారు గాని. 'ఏందో నీవుండబట్టి మాకీ పట్నంలో ఇంత చోటు చూపెట్టావు. నేకపోతే ఏంచేత్తుము మేము. 'చాయ్ తాగుతూ యిద్దరూ చాపమీద కూర్చున్నరు. 'అన్నా నే పనికి పోవాల. కాంట్రాక్టరు వచ్చి

డి.కామేశ్వరి

పట్టుకుపోతాడు. రేపు నిన్ను తీసకెడత. ఉదయం ఎనిమిదికల్లా సిద్దంగుండాలి టిఫినులో యింత అన్నం తెచ్చుకోవాలి. యీ పూట ఇంటికి కావాల్సినవన్ని కొనుక్కోండి. మా ఆడదియాళ పనికి రాదు అది వచ్చి అన్నంకి తీసుకుపోతుంది.. మరి నే బోతా. డబ్బులు కాస్త తెచ్చుకున్నరా. పని దొరికే వరకు బియ్యం, ఉప్పు, పప్పు కొనడానికి, మాట్లాడుతూనే హడావిడిగా వెళ్ళిపోయాడు.

రాజమ్మ దిగాలుగా చాయ్ తాగుతూ కూర్చుంది. పుట్టి పెరిగి కాపురం చేసిన పల్లెలో నలభై ఏళ్ళుండి ఇప్పుడిలా ఉన్న వూరు వదిలి పని వెతుక్కుంటూ పట్నం వస్తామని ఎన్నడూ అనుకోలేదు. నీళ్ళలోంచి గట్టున పడేసిన చాపలా వుంది తమ స్థితి. యీ కొంప చూస్తేనే సగం జావకారింది రాజమ్మ- పల్లెటూరిలోనూ వున్నది పూరిల్లే- కాని ఎంచక్కా ఎంత పెద్దది- వెనకాతల పంచదించి వంటకి, ముందు పంచదించి పెద్ద అరుగు, వెనక పెరడు- ముందు వాకిలి- పేడతో అలికి ముగ్గులు పెట్టిన నేల, గోడలు కుదురుమట్టంగా వుండేది. వాకిట్లో అరుగుమీద కూర్చుంటే ఎంతగాలి. పెరట్లో నాలుగురకాల పాదులు, ఆకుకూరలు, వంగమిర్చిలాంటి మొక్కలు- ముందు వాకిట్లో బంతి, గోరింట, కనకాంబరం, మందార మొక్కలు- వెనకాతల నుయ్యి... యిదేంకొంప, గట్టిగా కాలు జాపుకు కూర్చుందికి, పడుకుందుకి లేదు, యీ కుళ్ల కాల్వల మధ్య కాపురం- ఎక్కడ స్నానం చెయ్యాలి, ఎక్కడికి చెంబట్టుకు పోవాలిరా దేముడా అనిపించింది. 'చాయ్‌గ్లాను కింద పెట్టి గుడిసె బయటికి వచ్చింది.

యిళ్లకి యిళ్లకి మధ్య వున్న స్థలంలో కొందరాడవాళ్లు చీర చుట్టుకుని నీళ్ల పోసు కుంటూ, పిల్లలకి పోస్తూ కనిపించారు. 'యిక్కడే స్నానం చెయ్యాలిగాబోలు' అనుకుంది రాజమ్మ. ఎదురింటి మామ్మ బియ్యం ఏరుతూ రాజమ్మని చూసి 'కొత్తగా వచ్చారా బిడ్డా' అంది. రాజమ్మ నవ్వి తలాడించింది. 'ఏ వూరు' చెప్పింది రాజమ్మ. 'అంతేలే పొట్ట కోసం యీ తిప్పలు- వూర్లు ఖాళి అయి యీ అయిదారాబాదుకి వచ్చి పడ్తన్నరు జనం, ఏదో కూలి పని దొర కదా అని- మేమూ అంతే, రెండెకరాల పొలం. యిల్లు వదులుకుని వచ్చాం- మూడేళ్లయి వానలు లేవు- పంటలు ఎండగట్టినాయి. నేల బీడు తేలింది.

ఏం తిని బతకాల, పిల్లల్ని ఎట్టా పెంచాలి- అన్ని వదిలివచ్చాం...'

'యిక్కడ బాగుందా మరి.. డబ్బులు బాగా దొరుకుతాయా మరి' రాజమ్మ సందేహంగా అడిగింది. 'ఏం బాగులే, కొడుకు కోడలు యిద్దరూ కూలికిపోతారు పనిదొరికినవాడు. నూర్రూపాయలు మొగాడికి, ఆడదానికి ఎనభై దొరుకుతాయి. 'అమ్మో, రోజుకి నూట ఎనభైయే... అంటే నెలకి- 'మనసులో లెక్కలు కట్టి గుండెల మీద చెయ్యేసుకుంది. నెలకి ఐదువేలే... ఏడాదంతా పొలంమీద కష్టపడ్డ. గింజలమ్ముకున్న అంత డబ్బు ఏడాదికోసారన్న కళ్లచూడరు తాము' "రోజూ పని దొరుకుద్ద... ఒకోసారి మూడు నాలుగురోజులు దొరకదు- దొరికిన రోజు బియ్యం, పప్పు, నూనె సరుకులు కొంటారు. యింటికాడ ఐదుగురం తినాలి. యింటద్దె యియ్యన్ని గడవాలిగందా...' రాజమ్మ ఆశ్చర్య

పోయినదానికి మామ్మ జవాబిచ్చింది.

'రోజు వనిదొరకదా' రాజమ్మ అమాయకంగా అంది.

'ఏడదొరుకుద్ది- మనలోంటోళ్లు వందలమంది వూర్లొదిలి వట్నం వచ్చి కూలివనికి ఎగవడ్తున్నరు. ఒకో మేస్త్రి ఒకో గ్రూపు పెట్టుకుంటాడు. రోడ్ల తవ్వుడు పని, బిల్డింగుల పని, ఏదో ఒకటి వుంటది- పనులెదున్నయి కూలీలూ బోలెడు మంది గందా, ఈల్లంతా పోయి ఒకో సెంటరులో కూర్చుంటారు. మేస్త్రీలొచ్చి మాట్లాడుకుని పనున్నచోటికి తోలుకుపోతారు" ముసలమ్మ వివరించింది.

కొమరయ్య రెండు సంచులలో సరుకులు మోసుకు రావడం చూసి చేతిలో సంచి అందుకుని లోపలికి నడిచింది రాజమ్మ. గదిలో ఓ మూల స్టవు- నీళ్లబిందె, గిన్నెలు అమర్చింది- తెచ్చిన పొట్లాలు విప్పి చూసింది. వట్టవగలే చీకటిగా వుంది లోపల. సంచిలో కట్టి తెచ్చిన లాంతరు తీసి తుడిచి గ్యాసునూనె సగంపోసి, మిగతా సగం స్టవులో పోసింది. "ఏందయ్యా! యీ గదిలో ఎట్టాగయ్యా వుండేది. కూర్చుందికి, పడు కుందికి కూడా లేకపోయె" అంది బెంగగా. కొమరయ్య చాపమీద కాలుచాచుకు కూర్చున్నాడు. 'ఏం చేస్తాం, కాని రోజులొచ్చాయి. సర్దుకు బతకాల మరి. కాస్త నిలదొక్కుకున్నాక ఇంకాస్త పెద్దగది తీసుకుందాంలే' పెళ్లానికి ధైర్యం చెప్పాడు. 'ఆ బకెటియ్యి అ పంపు కాడ నించి నీళ్లు తెస్తా స్నానం చేయద్దామరి' అన్నాడు. రాజమ్మ తలూపింది.


పన్నెండు గంటలకి యాదగిరి పెళ్లాం సుజాతొచ్చి భోజనానికి తమ యింటికి తీసుకువెళ్లింది. వేడన్నం, పప్పుచారు, చింతకాయ తొక్కు వేసింది. ఉల్లిపాయ ముక్కలు కాసింత చింతపండు పిసికి, పచ్చి మిరపకాయలు వేసి పక్కనవేసింది. కాస్త బిడియంగా 'కూరవండలేదక్కా... కూరగాయలు కొనేట్టులేదు, గుడ్డు కూర రాత్రికి చేస్తా ఆడుంటాడుగదా రేతిరికి, రేతిరి కూడా యీడనే తిందురు రండి' అంది. 'వద్దమ్మా, రాత్రికి వంటచేస్తాలే' అంది రాజమ్మ- 'రండక్కా అంతా కల్సి సరదాగా తిందాం- రేపటినించి ఎవరి పాటు వారిదేగందా- నాకవసరం వచ్చిన నాడు నీవు నాకు పెట్టవా' అంది చనువుగా. 'కూరగాయలు చాలా ప్రియంగున్నయా' రాజమ్మ తింటూ ఆరా తీసింది. 'అబ్బే ఏది సూడు పావు నాలుగు, ఐదుకి తక్కువ నేదు. యింట్లో ఐదుగురం అర్థ కిలో వుండాలిగందా- వూటకి ఓ కూరకి పది రూపాయలెక్కడ ఖర్చు పెట్టేది- యింత పప్పు ఉడకేసి ఏదో ఆకుకూర పడేస్తా ఏంచెయ్యాలి కరువు రోజు రోజుకి పెరుగుతూంది. వంద రూపాయలు కూలి వొస్తాయి అన్నపేరే. ఏది కొనబోతే అదే అడవి- పప్పు ముప్పై రూపాయలు- బియ్యం పన్నెండు... పంచదార... చామ నూనె... గ్యాసునూనె ఎన్ని కావాలక్క సంసారానికి- పైన ఎదిగొచ్చేపిల్లలు బట్ట పాత, యింక పిల్లలగాల్లు సిన్నోళ్లు బడికి పోతల్లే లేకపోతే అల్ల పుస్తకాలు అదో ఖర్చు... ఆడవాళ్లిద్దరూ సంసార గొడవలు, ధరలు గురించి మాట్లాడుకుంటా తిన్నారు. కొమరయ్య తిని చేయి కడుక్కుని గుడిసెకి పోయి చాపమీద పడుకున్నడు- పట్నం సంగతులు, ఏవి ఎక్కడ కొనాలి, ఏం దొరుకుతాయి, నీళ్లెప్పుడు వస్తాయి, పాలు ఏడనించి తెచ్చుకోవాలి వివరాలన్నీ మాట్లాడింది రాజమ్మ.

** ** **

లిబర్టి సెంటరు పెట్రోలుబంకు దగ్గిర ఉదయం ఎనిమిది గంటల కల్లా ఓ ఏభై అరవై ఆడ మగ కూలి వనుల కోసం ఎదురు చూస్తా కూర్చుంటారు. 'ఈ పొద్దు నేను ఒక్కడ్నిపోయొస్తా... అనలేందీ చూసి రాని, రేవు నీ వొద్దు వులే' అన్నాడు కొమరయ్య. 'అవును. యీ పొద్దు మేస్త్రికి సెప్పనీ, రేవు తీసి కెడతా సెప్పి' అన్నడు యాదగిరి కూడా.

ఎనిమిదిన్నరకల్లా మేస్త్రి వచ్చాడు- 'యీయాల స్లాబ్ వనుంది. మొత్తం పన్నెండు మంది కావాల నాకు-' అన్నాడు. యాదగిరి, కొమరయ్యతోపాటు మరో పదిమందిని తీసు కుని వెళ్లాడు మేస్త్రి- ఆరోజు స్లాబ్ పని మధ్యలో ఆపేది లేదు కనక రాత్రి ఏడు గంటలవరకు సాగింది. కూలి కూడ నూర్రూపాయలు బదులు నూట ఇరవై

పదిగంటలవని
ఏకధాటిగా అలవాటులేని
కొమరయ్యకి వళ్లంతా నెప్పులు,
కాళ్లపిక్కలు పట్టేసాయి. అలసటకి తినగా
నే వళ్లెరగక పడుకున్నడు.
రాజమ్మకి మాత్రం అ యిరుకు గదిలో
ఊపిరాడక, గాలిలేక, దోమల మధ్య
నిద్రేపట్టలేదు. చేతిలో డబ్బు పడ్తుం
దన్న సంతోషం తప్ప యీ గదిలో
వుండేది ఎలారా అన్న చింతే
రాజమ్మకి.




యిచ్చారు. కొమరయ్య యాదగిరి యింటికొచ్చేసరికి ఎనిమిదయింది. రాజమ్మ ఆరుగంటలకి రావల్సిన వాళ్లు రాకపోయేసరికి గాభరాపడి సుజాత దగ్గరకెళ్లింది. 'వస్తార్లే అక్క. సివెంటు వనుంటే మధ్యలో అపరు. పూర్తి కాంగానే వస్తారంది.'

భార్యాభర్త ఒకరోజు నూటయిరవై చూసి సంబరపడ్డారు. 'రేపు నించి నేనూ వస్తా, యింట్లో కూచుని నే చేసే పాటు ఏవుంది' అంది. కొమరయ్య తలూపాడు.

పదిగంటలపని ఏకధాటిగా అలవాటు లేని కొమరయ్యకి వళ్లంతా నెప్పులు, కాళ్ల పిక్కలు పట్టేసాయి. అలసటకి తినగానే వళ్లెరగక పడుకున్నడు. రాజమ్మకి మాత్రం ఆ ఇరుకు గదిలో ఊపిరాడక, గాలిలేక, దోమల మధ్య నిద్రే పట్టలేదు. చేతిలో డబ్బు పడ్తుందన్న సంతోషం తప్ప యీ గదిలో వుండేది ఎలారా అన్న చింతే రాజమ్మకి.

** ** **

కొముర య్య, రాజమ్మ వట్నం వచ్చి రెండు నెలలు గడిచాయి. యిద్దరికిద్దరూ చిక్కి నగం అయి కళ్లు, పళ్లు వెళ్లు కొచ్చాయి. అలవాటులేని పని, సరి అయిన తిండి, మంచి గాలి వెలుతురు, నీళ్లకి అన్నింటికి మొహం వాచినట్టు అయింది ఇద్దరికి-వూర్లో రెండెకరాల పొలం పని ఏదో నాటులప్పుడు, కోతలు, కుప్పనూర్పిడి టైమూ- ఏడాదికి రెండుమూడు నెలలు తప్ప మిగతాప్పుడు ఏదో అలా పొలం వెళ్లి కలుపు మొక్కలు పీకడం, కాస్త కాలవలు మట్టి సరిచేయడం- నీళ్లమోటారు వేసి నీళ్లు పెట్టడం అలా కాసేపు తిరిగివస్తే అయిపోయేది. వచ్చేటప్పుడు పొలం గట్లంట వేసిన ఆనపకాయో, బీరకాయలో- గట్లంట తవ్వి కందమూలాలో గుమ్మిడికాయో ఏదో మూట కట్టి తెచ్చేవాడు. అక్కడ చేతిలో డబ్బులాడకపోయినా తిండిగింజలకి, అధరువులకి తడుముకోలేదెప్పుడూ. పెరట్లో కాసిన వంకాయలు, టమోటాలు కలిపి ఓ కూర- నాలుగు చింతకాయ లేరుకొచ్చి యింత పచ్చిమిర్చి వేసి పచ్చడి నూరేది. ఆనప కాయ కాస్తే పప్పులో వేసేది. మామిడికాలంలో చెట్లంట రాలిన కాయలు పచ్చడి నూరేది. ఏకాలంలో ఆకాలంలో కూరనార కొనకుండా దొరికేవి- యింట్లో నూతి గట్టదగ్గిర అరటిచెట్లు గెలేసేవి- నీళ్లు కాల్వచేసి వంగ, టమోట, బెండ, ఆకుకూర వేసేవారు- పొలంగట్ల మీద ఆనప, గుమ్మడి వేసేవారు. దోసపాదు యింటి కప్పు మీద పాకేది- తిండిగింజలు పండేవి- కూర నారకి లోటులేదు. ఆ వూరి కామందు యింటి గొడ్లశాలలో గడ్డిగాదం శుభ్రంచేస్తే ఇచ్చే పేడ పట్టుకొచ్చి పిడకలు చేసి ఎండుపుల్లలు తోటలంగ ఏరుకొస్తే పొయ్యికిందకి అయ్యేది. గొడ్లసావిడి శుభ్రం చేసినందుకు గ్లాసుడు పాలిచ్చేది దొరసానమ్మ- చాయ తాగడాని కవి సరి




పోయేవి. నూనె,పప్పు, పంచ దారలాంటివి కొంటే సరిపోయేది. యింట్లో రెండు కోళ్లుండేవి. గుడ్లు పెట్టేవి. కూర కయ్యేది అపుడపుడు. మంచిగా తినే వారు. మంచినీరు, గాలి ఆరోగ్యం వుండేది.

యిక్కడకొచ్చిన రెండు నెలల్లో పని దొరకని రోజులే ఎక్కువ. దొరికిన నాడు అలవాటలేక వళ్లు పులిసేది. యిక్కడ ఉల్లిగడ్డ మొదలు, కూరనార బియ్యం, గ్యాసునూనె, పాలు అన్నీ కొనాల్సిందే- కూరల ధరలు మండిపోయి కూరలేకుండా యింత వప్పుచారు, రెండు ఉల్లిగడ్డలు చింత పండు, ఎండుమిర్చి నూరిన వచ్చడి తవ్వ నాలిక్కి రాసుకుందుకి ఏం దొరకలేదు. రెండు గుడ్లుడకపెట్టి కూరచేసేది అప్పుడప్పుడు. శుభ్రంగా స్నానంచేసి ఎన్నాళ్లో అయినట్టనిపించసాగింది యిద్దరికి. బకెట్ నీళ్లు మోసుకొచ్చి స్నానం- మరో బకెట్టు గిన్నెలకి, బట్టలకి- బోరు పంపుకొట్టి కొట్టి చేతులు పడేవి. ఉక్క, దోమల మధ్య కంటినిండా నిద్రపోయి ఎన్నాళ్లయింది అనిపించసాగింది. మధ్యలో రెండుసార్లు రాజమ్మకి మలేరియా పట్టుకుంది. సిమెంటు పని అలవాటులేక కొమురయ్యకి దగ్గు, ఆయాసం- మందులు, డాక్టరు ఖర్చులు- ఉడకపోత గాలిదూరని గుడిసెలో ప్రాణం ఉుంగచుట్టుకుపోయేది. పల్లెలో రెండు నులక మంచాలేసుకుని వీధి గుమ్మంలో పడుకుంటే ప్రాణం ఎటో వెళ్లిపోయినట్టండేది. యిక్కడ బయట మంచమేసుకుని పడు కునే చోటేలేదు. ఇంకో కొంపచూడు అని పోరు పెట్టింది రాజమ్మ. యాదగిరి, కొమరయ్య తిరిగితిరిగి చూసారు. కాస్త గది ఆకారం వుంటే చాలు ఐదొందలకి తక్కువలేదు. కరెంటు బల్బు వుంటే ఆరొందలు- తెచ్చుకున్నదానిలో ఐదొందలు అద్దెపోతే ఏంతినాలి- బియ్యం, గ్యాసునూనెకే ఐదొందలవుతుంది. రెండు నెలలు కూలికిపోతే తెచ్చినది ఖర్చయినది చూసుకుంటే చేతిలో రెండు మూడు వందలకి మించి లేదు. చీరలు చిరిగాయి. ఓ ధోవతి, చొక్కా కొనాలని దాచిన డబ్బది. ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్టుంది పరిస్థితి. తమ వూరి వారంతా సగంమంది ఎకరా రెండెకరాలున్న సన్నకారు రైతులంతా వానలు లేక, నీరందక పొలాలు వట్టిపోయి మూడేళ్లుగా అప్పులపాలయి వున్న వూరొదిలి కూలీ పనులకి పట్నం పోయారు. సిటీలో రోజుకి నూర్రూపాయలు కూలి యిక్కడ ఏడాదంతా కష్ట పడ్డా దొరకని డబ్బు నెలరోజులలో సంపాదించుకుంటున్నారు అని వెళ్లినవాళ్ల కబుర్లు యీనోటా ఆనోట పాకి ఒకరి తర్వాత వకరు వలసపోయారు. కొమరయ్య సంసారం చిన్నది. పుట్టిన కొడుకొకడు పాము కరిచి పదేళ్లకి పోయాడు. కూతురు అయినింటే సుఖంగా కాపురం చేసుకుంటూంది. రెండేళ్లుగా పంటలు చేతికి రాకపోయినా వున్నగింజలు పెట్టుకు, పొలంలో దొరికే కూర నారతో కాలక్షేపం చేశారు. గింజలు నిండుకున్నయి. మరీ దారిలేక పట్నం రాక తప్పలేదు. వస్తే యిక్కడి పరి స్థితుల్లో యిమడ లేకపోయారిద్దరికిద్దరు. మంచినీళ్లు, గాలికి మొహంవాచి నట్లయిపోయారిద్దరూ. విశాలంగా తిరిగే యిల్లొదిలి, కలుగులాంటి గుడిసెలో జైలు జీవితం గడుపుతున్నట్లని పించసాగింది.

మంచినీళ్లు, గాలికి మొహంవాచి నట్లయిపోయారిద్దరూ. విశాలంగా తిరిగే యిల్లొదిలి, కలుగులాంటి గుడిసెలో జైలు జీవితం గడుపుతున్నట్లని పించసాగింది.
'నేనీడ వుండలేను మన వూరుపోదాం. నాకిక్కడ ఉక్కిరిబిక్కిరిగా వుంది, పానానికి సుకంనేదు- కలోగంజో అక్కడే తాగుదాం పోదాం పద' అని మొదలుపెట్టింది.



'నేనీడ వుండలేను మన వూరుపోదాం. నాకిక్కడ ఉక్కిరిబిక్కిరిగా వుంది, పానానికి సుకంనేదు- కలో గంజో అక్కడే తాగుదాం పోదాం పద' అని మొదలుపెట్టింది. రాజమ్మ మలేరియా జ్వరం తగ్గాక నీర్సం నించి కోలు కోలేకపోతూంది.

'పోయిఏం తింటామే, అ కలోగంజో నేకేగందా యిక్కడికి వచ్చాం' ఇక్కడేదో కాస్తోకూస్తో సేతిలో డబ్బు లగవడ్తన్నాయి. అక్కడ పంట నేకపోతే పైన వుండ దుగదా.'

'మావా, పొలంలో కూరగాయలో, సజ్జలో, జొన్నలో తడిపంటకాకుండా వేయరాదా, వరి వద్దు యింకేదన్నా వేద్దారి- నీళ్లు తక్కువ పంట... ఏదో దొరికింది తిందాం, తిన్నా తినకపోయినా గాలి, నీరన్న వుండేది. పాణం ఎప్పుడూ సుకంవుండేది. యీడికొచ్చిం దగ్గిరనించి రోగమే. నాకేం బాగునేదు, పోదాం పద' వంతం పట్టింది రాజమ్మ. కొమరయ్య ఆలోచనలో పడ్డాడు. అతనికీ సంతోషంగా లేదు యిక్కడ. కాని వేరే దారేది. పొడి పంట లేసి, కూరగాయలు వేసి అవి అమ్ముకుని తిండిగింజలు కొంటే- కూరగాయలకేనా నీరు కావాలిగందా- దేముడి దయ వల్ల యింటి నుయ్యిలో ఎప్పుడూ నీరుంటుంది- కష్టపడి నీరు మోసి మొక్కలకి పోస్తే- పండిన కూరనార రైతుబజారు తెచ్చి అమ్ముకుంటే- ఇద్దరికి బతుకు గడవదా. ఇక్కడ రాళ్లుకొట్టి, రాళ్లు మోసి, రోడ్లు తవ్విన కష్టం బదులు నీళ్లు మోసి మొక్కలేసుకుంటే- వానదేముడు కరుణించి ఈ ఏడు వానలు కురిస్తే... కొమరయ్య ఆలోచనలో పడ్డాడు.

'ఈవడే కష్టం అక్కడే వడదారి పెరడంతా బాగుచేసి కూరగాయలు మొక్కలు వేద్దాం. పొలం గట్లంట కూడా వేద్దాం టమోట, వంగ, బెండ- నీరు తోడి పోద్దాం. సజ్జలు వేద్దాం యీసారి. సూద్దాం ఎట్లా జరు గుద్దో' రాజమ్మ ప్రోత్సాహం యిచ్చింది.

వచ్చినపుడు తెచ్చుకున్న మూడొందలతో మళ్లీ తిరుగు మొహం పట్టారు, కొత్త ఆశతో, కొత్త ఊహలతో, కొత్త ఉత్సాహంతో.

●

**రూ. 21,00,000/-ల విలువగల బహుమతులు గెలవండి - ఎంట్రీఫీజు లేదు**

| ఉదాహరణ | | |
|---|---|---|
| 4 | 9 | 8 |
| 11 | 7 | 3 |
| 6 | 5 | 10 |

1వ బహుమతులు - టాటాసుమో - (ఇద్దరికి)
2వ బహుమతులు - హీరోహోండా, (ఎనిమిది మందికి)
కన్సొలేషన్ బహుమతులు - వెస్పాస్కూటర్, సి.డి. ప్లేయర్, కలర్ టి.వి., ఆటోమేటిక్ కెమెరా, ఎయిర్‌కూలర్, వాషింగ్ మెషిన్, టు-ఇన్-వన్ (పథకం MB&HP క్రింద)

| | | |
|---|---|---|
| 5 | | |
| | 8 | |
| | | 11 |

*** మొదటి 200 సరైన ఎంట్రీలకు ఒక్కొక్కరికి 4 గ్రాముల ఒక బంగారు నాణెం**

పైన తెలిపిన విధంగా, తెల్లకాగితం మీద లేదా ఇన్‌లాండ్ లెటర్పై లేదా పోస్టుకార్డుపై 9 ఖాళీ చతురస్రాలు గీయండి. 4 నుండి 12 అంకెలు వాడుతూ ఏ కోణం నుంచి కూడినా 24 వచ్చేలా చూడండి..ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి., మీ ఎంట్రీలు సాధారణ పోస్టులో 15 రోజుల్లోగా చేరాలి. వెంటనే వ్రాయండి, ఆలస్యం చేయకండి.

**Add :- DINA BHAVAN (D/50)**
**P.O. Lal Bigha (GAYA)**